*ఎమ్బీయస్ క్రైమ్ రచన - 10*

## సెక్స్ స్పై : మాతా హరి




మొదటి ప్రపంచ యుద్ధకాలంలో సెక్స్ స్పైగా పేరు గాంచిన మాతా హరి ఆనాడు కలిగించిన సెన్సేషన్ అంతా యింతా కాదు. ప్యారిస్‌లో కాబరే డాన్సులు చేసుకునే 40 ఏళ్ల యువతి జర్మన్ గూఢచారిణిగా పని చేసి బ్రిటిష్ సీక్రెట్ సర్వీసెస్ వారికి చిక్కింది. 50 వేల మంది మిత్రరాజ్యాల సైనికుల చావుకి కారణమైందన్న అభియోగంతో ఆమెను కాల్చిచంపారు. తన అందచందాలతో అంతటి అసాధ్యమైన కార్యాన్ని సాధించిందన్న అంశం అనేకమంది కథకులను ఉత్తేజపరిచింది. ఇప్పటికి కూడా ఆమెపై సినిమాలు తయారవుతూన్నాయి. అయితే వాటిలో వాస్తవమెంత? కల్పన ఎంత? అనే విషయంపై యిటీవల చర్చలు జరుగుతున్నాయి.

మాతా హరి ఆమె పెట్టుడు పేరు. అసలు పేరు మార్గరెటా జెల్లె. డచ్ జాతీయురాలు. నెదర్లండ్స్‌లో 1876లో పుట్టింది. ముగ్గురు తమ్ముళ్లు. తండ్రి ఆయిల్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టి బాగా ఆర్జించాడు. మార్గరెటా బాల్యం వైభవంగా గడిచింది కానీ ఆమె 13 వ యేట తండ్రి దివాలా తీశాడు. తలిదండ్రులు విడాకులు తీసుకున్నారు. ఇంకో రెండేళ్లల్లో తల్లి చనిపోయింది. తండ్రి యింకో ఆమెను పెళ్లాడాడు. ఈమెను ఒకతను దత్తత తీసుకుని టీచర్ ట్రెయినింగ్ కోర్సులో చేర్పించాడు. కానీ ఆమె అక్కడి హెడ్‌మాస్టర్‌తో రాసలీలలు సాగించడంతో ఆ స్కూల్లోంచి తీసేసి యింట్లో కూర్చోమన్నాడు. కొన్ని నెలలు యింట్లో కూర్చుని ఆమె ఓ రోజు హేగ్ పట్టణంలోని తన మామయ్య యింటికి పారిపోయింది.

తన 18 వ యేట తన కంటె 20 ఏళ్లు పెద్దవాడైన ఓ కులీనుణ్ని పెళ్లాడింది. అతను కాప్టెన్ రుడాల్ఫ్ మెక్‌లాయిడ్ అనే స్కాట్లండ్‌కు చెందిన రాజవంశీకుడు. డచ్ ఆర్మీలో పనిచేస్తున్నాడు. ఆ వివాహం వలన ఆమె సడన్‌గా ఉన్నతస్థాయికి వెళ్లిపోయింది. వాళ్లకు ఓ కొడుకు పుట్టాడు. ఆ రుడాల్ఫ్ పేరుకు ధనికుడే కానీ జూదరి, తాగుబోతు. జూదంలో డబ్బు పోగొట్టుకుని ఆ కోపమంతా భార్యపై తీర్చుకునేవాడు. డబ్బంతా తరిగి, అప్పులు పెరిగాయి. దర్జా మేన్‌టేన్ చేయాలంటే డబ్బు కావాలి. దానికోసం మార్గరెట్ ఓ ధనికుడైన జమీందారుకి ఉంపుడుగత్తెగా మారింది. తర్వాత మార్గరెట్‌కు ఓ కూతురు పుట్టింది.

ఇంతలో రుడాల్ఫ్‌కు జావా ద్వీపానికి బదిలీ అయింది. ఇండియా ఇంగ్లండు వారికి వలసరాజ్యమైనట్లే జావా డచ్ వారి వలసదేశంగా వుండేది. అక్కడికి వెళ్లాక కూడా రుడాల్ఫ్ అదృష్టం మారలేదు. పైగా ప్రమోషన్ కూడా రాలేదు. భార్యమీద అక్కసుతో ఓ జావా అమ్మాయిని పెళ్లి చేసుకుని, యింకో అమ్మాయిని ఉంపుడుకత్తెగా పెట్టుకున్నాడు. మార్గరెట్ తక్కువ తినలేదు. అతన్ని వదిలేసి యింకో డచ్ ఆఫీసర్‌తో వుండసాగింది. కొన్నాళ్లకి రుడాల్ఫ్ బతిమాలి భార్యను వెనక్కి తెచ్చుకున్నాడు. ఇంతలో అంటురోగం తగిలి వాళ్ల కొడుకు చచ్చిపోయాడు. కూతురు చచ్చి బతికింది. ఇంతలో రుడాల్ఫ్‌కి నెదర్లాండ్స్‌కు బదిలీ అయింది. 1902నుండి భార్యాభర్తలు విడిగా వుండసాగారు. ఐదేళ్ల తర్వాత అధికారికంగా విడాకులు తీసుకున్నారు. మార్గరెట్ కూతుర్ని తన వద్దే వుంచుకుంది కానీ భర్త భరణం సరిగ్గా యివ్వకపోవడంతో పోషణ చేయలేక అతనికి అప్పగించేసింది. ఆ కూతురు 21 వ యేట చనిపోయింది.




1903లో మార్గరెట్ పారిస్‌కి వెళ్లి తన 27 వ యేట కళాకారిణిగా జీవితం ప్రారంభించింది. జావాలో వుండే రోజుల్లో తన వ్యక్తిగత సమస్యలు మర్చిపోవడానికి ఆమె జావా ద్వీపపు నృత్యరీతులు అభ్యసించింది. అక్కడి ఇండోనేషియన్ సంస్కృతి చూసి ముచ్చటపడి తన పేరును "మాతా హరి"గా చెప్పుకోసాగింది. (ఆ మాటకు ఇండోనేషియన్ భాషలో అర్థం - దివానేత్రం అనగా సూర్యుడు). పారిస్‌కి వచ్చాక లేడీ మెక్‌లాయిడ్ అనే పేరుతో సర్కస్‌లో గుఱ్ఱపు స్వారీ చేసే అమ్మాయిగా పనిచేసింది. మెక్‌లాయిడ్ యింటి పేరు వున్న

జమీందార్లు చికాకు పడ్డారు. సర్కస్‌లో వచ్చే డబ్బు చాలక ఆర్టిస్టులకు మోడల్‌గా పనిచేసేది. 1905 మార్చి నుండి డాన్సులు చేయసాగింది.



అప్పట్లో పారిస్‌లో డాన్సులు చేసేవాళ్లకు కొదవ లేదు. తనకంటూ ఒక ప్రత్యేకత వుండాలని ఒక ఎక్సోటిక్ డాన్సర్‌గా తనను తాను చూపుకుంది. తన పేరు 'మాతా హరి'గా చెప్పుకుంది. జావా కనక్షన్ వుండడంతో తను మలబార్‌కి చెందిన ఒక హిందూ పూజారికి, జావా యువరాణికి పుట్టానని చెప్పుకునేది. చిన్నప్పటినుండీ భారతీయనృత్యాన్ని అభ్యసించానని చెప్పుకునేది. తన శరీరం ప్రదర్శించడానికి ఏ మాత్రం సంకోచించేది కాదు. రెచ్చగొట్టే పద్ధతిలో స్ట్రిప్ టీజ్ నాట్యం చేసేది. చివర్లో వజ్రాలద్దిన బ్రా మాత్రం వుంచుకునేది. నేపథ్యంలో పెట్టే కట్టడాలకు కాస్త ఆసియన్ టచ్ యివ్వడంతో యిదో వింతగా తోచి జనాలు ఆమెను చూడడానికి వచ్చేవారు. అప్పట్లో వాళ్లకు ఆసియా సంస్కృతి గురించి పెద్దగా తెలియదు. విమర్శకులు ఆమెని బోగస్ అని కొట్టి పారేసినా ఆమెను ప్రజలు బాగా ఆదరించారు.

ఆమె బాగా పాప్యులర్ కావడంతో ధనవంతులు ఆమె వెంట పడ్డారు. గ్యామెట్ అనే పారిశ్రామికవేత్త ఆమెను వుంచుకున్నాడు. అంతేకాదు, అనేకమంది మిలటరీ అధికారులు, రాజకీయవేత్తలు, పలుకుబడి గలవారు ఆమెతో సంబంధం పెట్టుకున్నారు. వారిలో జర్మన్ యువరాజు ఫ్రెడరిక్ కూడా వున్నాడు. ఆమె విలాసవంతమైన జీవితానికి అయ్యే ఖర్చు అతనే భరించేవాడట. యూరోపంతా ఆమె పర్యటించేది. ఒక డాన్సర్‌గా, సంప్రదాయ విరుద్ధమైన స్వైరిణిగా ఆమెకు పేరు రావడంతో ఆమె వెళ్లిన చోటల్లా ధనవంతులు ఆమెను పార్టీలకు ఆహ్వానించేవారు. మొదటి ప్రపంచయుద్ధం రావడంతో కథ మారిపోయింది.

ఆ యుద్ధంలో జర్మనీ ఒక పక్క, ఇంగ్లండ్, ఫ్రాన్సు, రష్యా మరో పక్క పోరాడుతున్నాయి. ఒక దేశపౌరుడు శత్రుదేశంలో తిరిగితే అరెస్టు చేస్తారు. ఆమె మాతృదేశమైన నెదర్లండ్స్ తటస్థదేశంగా వుంది. ఆ దేశ పౌరురాలుగా ఆమె ఏ దేశంలోనైనా తిరగవచ్చు. అందువలన ఆమె యూరోప్‌లోని అన్ని దేశాలలో స్వేచ్ఛగా తిరిగేది. అదే ఆమె కొంప ముంచింది. 1917 ఫిబ్రవరిలో ఫ్రెంచ్ గూఢచారి శాఖ ఆమెను పారిస్‌లో అరెస్టు చేసింది. ఆమెను జర్మన్ గూఢచారిణిగా పేర్కొని దానికి తగ్గట్టు కేసు తయారుచేశారు. వాళ్లు చెప్పినదాని ప్రకారం –

'యుద్ధానికి ముందే జర్మన్ వాళ్లు ఆమెను లార్చి పట్టణంలో ఓ గూఢచారి ట్రెయినింగ్ స్కూలులో ఆమెకు జర్మన్లు తర్ఫీదు యిప్పించారు. యుద్ధం ప్రారంభమయ్యాక 1912లో జర్మన్ వీధుల్లో ఆమె జర్మన్ పోలీసు చీఫ్‌తో కలిసి కారులో తిరిగింది. 1913లో ఫ్రాన్సుకి వచ్చి డాన్సింగ్ మానేసింది. సోషల్ సర్కిల్లో తిరుగుతూ అక్కడి మిలటరీ అధికారులతో శారీరకంగా కలుస్తూ, ఆ మత్తులో వాళ్లు చెప్పిన రహస్యాలను జర్మన్లకు చేరవేసింది. 1916లో ఆమె స్పెయిన్‌కు ఓడలో వెళుతూంటే బ్రిటన్‌లో ఫాల్స్‌మౌత్ అనే రేవులో ఆపేసి స్కాట్లండ్ యార్డ్ వాళ్లు ఆమెను నిర్బంధంలోకి తీసుకుని విచారించారు. తను ఫ్రెంచ్ యింటెలిజెన్సుకి పని చేస్తున్నట్లు ఆమె చెప్పుకుంది.'

అంటే ఆమె అటు ఫ్రెంచ్ వారికీ, యిటు జర్మన్ వారికీ యిద్దరికీ డబుల్ ఏజంటుగా పనిచేసిందా? ఫ్రెంచ్ వాళ్లు అన్నదేమిటంటే – '1917లో స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో వున్న జర్మన్ మిలటరీ ఎటాచీ బెర్లిన్ వాళ్లకు పంపిన రహస్యసందేశంలో ఎచ్-21 అనే జర్మన్ గూఢచారి తమకు చాలా సహాయపడుతోందని వుంది. ఆ కోడ్ మేం ఛేదించాం కాబట్టి చదవగలిగాం. ఆ ఎచ్-21 మాతా హరి అనే కనిపెట్టాం. ఆ సందేశంలో ఆ ఏజంటుకి 15 వేల మార్కులు యివ్వాలని వుంది. మాతా హరి ఖాతాలో 30 వేలు జమపడ్డాయి.' నిజానికి ఆ పాటికి ఫ్రెంచ్ వాళ్లు తమ కోడ్ ఛేదించారని జర్మన్‌వాళ్లకు అప్పటికే తెలిసిపోయింది. అందువలన యీ సందేశాలన్నీ ఫ్రెంచ్‌వాళ్లు కావాలని పుట్టించారని తర్వాత రోజుల్లో అనుమానం వచ్చింది.



ఆమెపై విచారణ జరిగినప్పుడు బ్రిటిష్, ఫ్రెంచ్ ఇంటెలిజెన్సు వారు ఆరోపణలకు ఆధారాలు చూపలేకపోయారు. ఆమె గదిలో సీక్రెట్ ఇంక్ దొరికింది కాబట్టి గూఢచారిణి




అన్నారు. ‘అది నా మేకప్‌లో భాగం’ అందామె. ఆరెస్టుకి ముందు మాడ్రిడ్‌నుండి వచ్చిందని, అక్కడ జర్మన్ గూఢచారులతో కలిసిందని ఆరోపించారు. దేశాలు తిరగడం తన వృత్తిధర్మం అంది ఆమె. తను అమాయకురాలినని పారిస్‌లోని డచ్ కాన్సలేట్‌కు చాలా ఉత్తరాలు రాసింది. అయినా ఆమె గోడు ఎవరూ వినిపించుకోలేదు. 50 వేల మంది సైనికుల చావుకు కారకురాలైందంటూ ఫ్రెంచ్‌వారు 1917 అక్టోబరు 15 న ఫైరింగ్ స్క్వాడ్ చేత కాల్పించి చంపించారు. అప్పుడు ఆమె వయసు 41.

ఇలా ఒక క్యాబరే నర్తకి రెండు దేశాలకు డబుల్ ఏజంటుగా పనిచేసిందనే కథనం అందరిలో ఉత్సుకత రేపి, ఆమె కథను అలాగే చూపుతూ వచ్చారు. కానీ 25 సంవత్సరాల క్రితం కొన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. మాతాహరి కేసు వివరాలు 100 ఏళ్లపాటు బయటి ప్రపంచానికి తెలియకూడదని సీల్ చేశారు. కానీ ఆమె జీవితగాథ రాసిన రచయిత కోరికపై 1985లో అతనికి చూపించారు. ఆమె నిరపరాధి అని అంటాడతను. మాతా హరిని ఫ్రెంచ్ గూఢచారిణిగా రిక్రూట్ చేసినతను తర్వాత ఆమెను మోసం చేశాడట. తనే ఫ్రాన్సుకి, జర్మనీకి డబుల్ ఏజంటుగా పనిచేశాడట. తన తప్పులు కప్పిపుచ్చుకోవడానికి ఆమెపై నేరం మోపి శాశ్వతంగా నోరు మూయించేశాడట.

నిజానిజాలు ఎప్పటికి బయటకు వస్తాయో తెలియదు. కానీ ఆమె మరణం తర్వాత అంత్యక్రియలకై ఆమె శవాన్ని తమకు అప్పగించండంటూ కుటుంబసభ్యులెవరూ ముందుకు రాలేదు. వైద్యపరిశోధనలకై దాన్ని ప్యారిస్‌లోని మ్యూజియం ఆఫ్ ఎనాటమీకి అప్పగించేశారు. 1931లో తీసిన “మాతా హరి” సినిమాలో హాలీవుడ్ సెక్స్ తార గ్రేటా గార్బో మాతా హరి పాత్ర ధరించడంతో ఆమె పేరు ప్రపంచమంతటా మారుమ్రోగిపోయింది. దానిలో చారిత్రక వాస్తవాలు తక్కువ, కల్పన ఎక్కువ అని ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత ఎన్నో పుస్తకాలు, మ్యూజికల్స్, టీవీ సీరియల్స్, సినిమాలు వస్తూనే వున్నాయి. ఆమె మామూలు గూఢచారిణి అయితే యింత గ్లామర్ వుండేది కాదు. క్యాబరే నర్తకి, విశృంఖల జీవనం గడిపిన మదవతి కావడంతో బోల్డంత ఆసక్తి కలిగింది. ఇంకా కొన్నేళ్లు గడిస్తే యింకా కొన్ని నిజాలు బయటకు రావచ్చు. పేరు గుర్తుంచుకుని గమనిస్తూ వుండండి. – **ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2012)**




(ఫోటోలు –1. 1904లో మాతాహరి, 2. కేవలం బ్రాతో ధరించి చేసిన నృత్యం 3. 1905లో పారిస్‌లో ప్రదర్శన 4. 1906లో పారిస్‌లో ప్రదర్శన 5. 1931లో గ్రేటా గార్బో నటించిన “మాతా హరి” సినిమా పోస్టర్ 6. 1985లో సిల్వియా క్రిస్టెల్ నటించిన “మాతా హరి” పోస్టర్